



జిల్లా మొత్తం సుడా పరిధిలోకి..



- కొత్తగా మూడు మున్సిపాలిటీలు
- 147 గ్రామపంచాయతీలను చేర్చుతూ ఆదేశాలు

కరీంనగర్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) పరిధిలోకి కొత్తగా 147 గ్రామపంచాయతీలు, మూడు మున్సిపాలిటీలను విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో జిల్లా మొత్తంగా సుడా పరిధిలోకి వచ్చాయి. శుక్రవారం చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలతోపాటు 147 గ్రామపంచాయతీలను సుడా పరిధిలో విలీనం చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిషోర్ జీవో ఎంఎస్ నెంబర్ 188ని జారీ చేశారు. కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం జిల్లాను మొత్తంగా సుడా పరిధిలో చేర్చింది. కరీ ంనగర్ వేగవంతంగా అభివృద్ధి చెందడంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయి. సుడా పరిధిలోకి గ్రామీణ ప్రాంతాలను కూడా చేర్చడంతో ఈ ప్రాంతాలు కూడా మౌలిక సదుపాయాల కల్పనకు నోచుకుంటాయి. అన్ని ప్రాంతాలకు రోడ్ నెట్ వర్క్, నీటి సరఫరా, విద్యుద్దీకరణ, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చి సబర్బన్ ప్రాంతాలుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే ఆలోచనతో ప్రభుత్వం ఈ చర్యకు పూనుకున్నట్లు తెలుస్తున్నది. 2017లో జిల్లాలో ని 61 గ్రామాలు, ఒక మున్సిపాలిటీ, ఒక కార్పొరేషన్‌తో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా)గా ఏర్పాటు చేసింది. 622 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో సుడా కార్యక్రమాలను చేపడుతోంది. సుడాను 2,160 చదరపు

మిగతా 8వ పేజీలో... ..

మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 25 : మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రామ సభకు మహిళలు తప్పనిసరిగా రావాలన్నారు. ఈ సభకు రావడం ద్వారా పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు మొదట తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద ప్రభుత్వాసుపత్రుల్లో 52 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, మహిళలందరూ మూడు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాల న్నారు. ఇవే పరీక్షలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేయించుకుంటే సుమారు 40 వేల పైన అవుతుందన్నారు. వచ్చే వ్యాధులను ముందే గుర్తించి జాగ్రత్త పడాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు విధిగా పంపించాలని తల్లులకు సూచించారు. భ్రూణ హత్యలు పాపమని, కడుపులో ఉన్న బిడ్డ ఆడపిల్ల అని తెలిస్తే బయటి ప్రపంచం చూడనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉండి విద్యావంతురాలైతే కుటుంబం బాగుంటుందని, కుటుంబం బాగుంటేనే ఊరు తద్వారా సమాజం బాగుపడుతుందన్నారు. మహిళలు తప్పనిసరిగా స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా చేరి ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ కనుకయ్య, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మహిళ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సైబర్ క్రైం కేసుల ఛేదనలో జిల్లాకు రాష్ట్రంలో 3వ స్థానం

- తరచుగా నేరాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సీపీ అభిషేక్ మొహంతి



నేరసమీక్షలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులు ఛేదన, బాధితుల సొత్తును తిరిగి ఇప్పించుటలో కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలిచిందని పోలీసు కమిషనర్ అభిషేక్‌రు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాలులో శుక్రవారం కమిషనరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు, సీఐలు, పోలీసు రాణాల ఎస్‌హెచ్‌ఓలతో పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ క్రైం ఛేదనలో కమిషనరేట్ పోలీసు అధి కారులు, సిబ్బందిని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు అభినందిం చారని అన్నారు. ఇదే స్ఫూర్తితో కమిషనరేట్ పోలీసు అధికారులు ముందుకుసాగుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యపరచాల న్నారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున వాటి నియంత్రణకు ఇప్పటికే పోలీస్ రాణాల వారీగా సైబర్ వారియర్‌లను నియమించామని, సంబంధిత పోలీస్ రాణాల్లో సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే వారు స్పందించి బాధితులకు సహకరించి 1930కి, ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌కి సమాచారం అందించి అకనాలెడ్జ్‌ని పొందాలని, దాని ఆధారంగా పోగొట్టుకున్న సొత్తును తిరిగి తెప్పించేలా చర్యలు తీసుకోవా లన్నారు. కమిషనరేట్ స్థాయి ంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామ న్నారు. ఈ కార్యాలయం ఎప్పటికప్పు డు కమిషనరేట్ స్థాయిలో జరిగే నేరాలు అడ్డుకట్టవేసేందుకు పనిచే స్తుందన్నారు. అక్రమ గంజాయి రవా ణా వినియోగం పెరిగిపోతు న్నందున దానిని అరికట్టేందుకు ఇప్పటికే ప్రత్యే కంగా కమిషనరేట్ స్థాయిలో నార్కో టిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామని, దాని సహాయంతో క్షేత్రస్థాయిలో ఎన్ డీపీఎస్ యాక్ట్ ద్వారా కేసులు నమో దు చేయాలన్నారు. గంజా యి పట్టు పడిన సమ యంలో వారిపై నమోదు చేసిన కేసు వీగిపోకుండా నిందితుడికి శిక్ష పడేవిధంగా టీజీ నాబ్ వారు ప్రవేశపెట్టిన నియమాలను తప్పని సరిగా పాటించాలన్నారు.

● అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపండి

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సీపీ ప్రత్యేక సమీక్ష చేశారు. అధికారులంతా ముఖ్యంగా అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి, క్షేత్రస్థాయిలో ఫలితాలనిచ్చే విధంగా చర్యలు ఉండాలని సూచించారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు ఉన్నట్లయితే వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తరుచూ నేరాలు జరిగే ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టి వాటిని అరికట్టేలా కృషి చేయాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినదని తెలిసిన వెంటనే స్పదించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సమాజంలో పదే పదే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారితో పాటు, ప్రజలను మోసం చేసే వారిపై ఖచ్చితంగా షీట్లను తెరవాలన్నారు. డివిజన్‌ల వారీగా రోడ్డు ప్రమాదాలపై సమీక్ష జరిపి, ఒకే చోట పలుసార్లు ప్రమాదాలు జరిగే చోటును హాట్‌స్పాట్‌గా గుర్తించి, వాటికీ గల కారణాలను తెలుసుకుని అవసరమైతే ఇతర శాఖల సమన్వయంతో సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కమీషనరేట్ వ్యాప్తంగా పోలీసు రాణాల వారీగా చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోకుని ఉక్కుపాదం మోపాలన్నారు. పట్టుబడిన వారిపై సంబంధిత కేసులు నమోదు చేయటమేగాక, వీలైనంత తొందరగా చార్జ్‌షీట్లు సైతం దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీలు శ్రీనివాస్ (సీఎస్‌బీ), నరేందర్, వెంకటరమణ, విజయ్‌కుమార్, వేణుగోపాల్, కాశయ్య, మాధవి, సైబర్ క్రైమ్ పోలీసు రాణా ఏసీపీ నర్సింహారెడ్డిలతో పాటుగా సీఐలు. ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు నెలల్లో అధునాతన లైబ్రరీ

- స్మార్ట్ సిటీ నిధులతో నిర్మాణ పనులు వేగవంతం
- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు



జిల్లా గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంధాలయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రాబోయే ఆరు నెలల్లో ఏడు కోట్ల రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో నాలుగు అంతస్తులతో కూడిన అధునాతన లైబ్రరీ నిర్మించనున్నట్లు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలసి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ పాత లైబ్రరీకి సుమారు 50 సంవత్సరాలు నిండాయని, నగరపాలక సంస్థ తమ బాధ్యతగా భావించి విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, పోటీ పరిక్షల అభ్యర్థులు, సీనియర్ సిటిజన్స్ చదువుకునేందుకు ఓ నూతన గ్రంథాలయం అవసరమని భావించి అన్నిహంగులు, వసతులు, ఏర్పాట్లతో కూడిన లైబ్రరీని నిర్మించాలని తలపెట్టామని అన్నారు. నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయని, 16వేల స్క్వేర్ ఫీట్స్ వైశాల్యంలో జి ప్లస్ 3, లిఫ్ట్, పార్కింగ్, గార్డెనింగ్‌తో కూడిన ప్రశాంత వాతావరణంలో జిల్లా వాసులకు ఓ సుందర లైబ్రరీ దర్శనమివ్వబోతుందని చెప్పారు. విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక బ్లాకులు, కంప్యూటర్ విభాగం, ఫర్నిచర్‌ను ఏర్పాటు చేస్తామని, స్టడీ మెటీరియల్ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. నగరంలో రోడ్లు, లైట్లు, డ్రైనేజీలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, చెట్ల పెంపకం, పారిశుధ్యం వంటి పనులు చాలా వరకు పరిష్కారం అయ్యాయని అన్నారు. నిధులు విడుదలైతే నగర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, దీనికి సదరు మంత్రులు, నాయకులు, అధికారులకు విన్నవించామని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లతో అధునాతన లైబ్రరీ నమూనా ప్రతిని చూసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాల రమణారావు, సుదగోని మాధవి కృష్ణాగౌడ్, మున్సిపల్ ఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈలు, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'లో వ్యక్తిగత పనులు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, అక్టోబరు25, (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో వ్యక్తిగత పనులకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఉపాధి హామీ అధికారులు సూచించారు. కరీంనగర్ మండలంలో ఉపాధి హామీ 2025-26 సంవత్సరానికి కూలీలకు పని పని కల్పించేందుకు పంచాయతీల వారీగా సమీక్ష చేస్తున్నారు. శనివారం కమిషనర్ రూరల్ డెవలప్‌మెంట్ టీం సభ్యులు కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో పరిశీలన చేశారు., స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ అభయ్, హార్టికల్చరల్ ఏడీ శరత్‌బాబు, ఏపీడీ కృష్ణ, ప్లాంటేషన్ మేనేజర్ సత్యనారాయణ పనుల ప్రణాళికల రికార్డులను పరిశీలించారు. ఉపాధిహామీ పనుల గుర్తింపు, బడ్జెట్ రూపకల్పనకు సంబంధించిన విధానాన్ని పరిశీలించారు. వ్యక్తిగత పనులైన పూల తోటలు, పండ్ల తోటలు, కూరగాయల పెంపకం, పశువుల పాక నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వార్షిక బడ్జెట్‌లో ప్రతి కూలీకి వంద రోజుల పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఏపీఓ శోభారాణి, గ్రామ కార్యదర్శి లచ్చయ్య, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీపీ అభిషేక్ మొహంతి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీలో పోలీస్‌కమిషనర్ పాల్గొన్నారు. పోలీస్‌కమిషనరేట్ కేంద్రంల నుంచి బస్టాండ్ మీదుగా ఇందిరాచౌక్, రాంగనర్, పాత లేబర్ అడ్డా, శివథియేటర్, కెమిస్ట్‌భవన్, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, టవర్ సర్కిల్, శాస్త్రీరోడ్, త్రీటౌన్ మీదుగా కమాన్ చౌరస్తా నుంచి వన్‌టౌన్ ద్వారా తిరిగి పోలీస్‌కమిషనరేట్ కేంద్రంకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరిస్తూ, సమాజంలో శాంతిభద్రతల స్థాపనకు పోలీసులు చేస్తున్న కృషిపట్ల ప్రజలకు అవగాహన కలిగే విధంగా ఈ సైకిల్ ర్యాలీ ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ, అనోక్ జయ్‌కుమార్, ఏసీపీలు నరేందర్, విజయ్‌కుమార్, వి మాధవి, వెంకటరమణ, సీఐలు సృజన్‌రెడ్డి, కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, సరిలాల్, స్వామి, ప్రకాష్‌గౌడ్, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు



వారెవ్వా.. వావిలాల ఖాదీ

- ఏటా కోట్లాది రూపాయల ఉత్పత్తులు
- వెయ్యి మంది కార్మికులకు ఉపాధి
- రెడిమేడ్ దుస్తులకు ధీటుగా వెరైటీ డిజైన్ల తయారీ

◆ జమ్మికుంట, ఆంధ్రజ్యోతి

7

చల్లంగ చూడు... యజ్ఞవరాహస్వామీ!

- ముగిసిన బ్రహ్మోత్సవాలు.. భక్తులతో కిక్కిరిసిన ఆలయం



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తజనం, స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యజ్ఞ వరాహస్వామిక్షేత్రంలో 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిసాయి. ఉదయం రథోత్సవ, చూర్ణోత్సవ, వసంతోత్సవాలు, చక్రస్నానం నేత్రపర్వంగా కొనసాగగా సాయంత్రం వీధి ఉత్సవం, ధ్వజావరోహణ, రాత్రి పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, శ్రీపుష్పయాగం, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిసాయి. కచ్చు అంజయ్య బృందం ఒగ్గుడోలు కళా విన్యాసాలు, శ్రీభాష్యం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాస్తా భజన మండలి సభ్యులు, లలితా ప్రసాద్, కిట్ల శ్రీనివాస్, అనుపమ హరిబాబు, వాణిల భక్తి కీర్తనలు అలరించాయి. చివరి రోజు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సైబర్‌క్రైం కేసులో ఇద్దరు గుజరాతీల అరెస్టు

- పెట్టుబడి పేరుతో 33.63 లక్షలు కొల్లగొట్టిన నిందితులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను కరీంనగర్ సైబర్ క్రైం ఏసీపీ వి నర్సింహారెడ్డి అరెస్టు చేశారు. డిప్యూటీ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన పచ్చునూరు సురేందర్ మొబైల్ ఫోన్‌కు టెలిగ్రాం యాప్, వాట్సాప్ ద్వారా 2023 సెప్టెంబరు 21 అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తి ఒక లింక్ పంపించాడు. బంగారం, ఎక్స్‌ఆర్‌పీలలో పెట్టుబడి పెడితే త్వరగా డబ్బులు రెట్టింపు అవుతాయని వాట్సాప్ చాటింగ్ ద్వారా నమ్మబలికాడు. దీనిని నమ్మిన సురేందర్ 2023 నవంబరు 2 నుంచి 2024 జూలై 2 వరకు 33 లక్షల 63 వేల రూపాయలు అహ్మద్‌ఖాన్ పంపించిన ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్ ఖాతాల్లో 30 లావాదేవీల్లో జమ చేశాడు. ఆ తరువాత అహ్మద్‌ఖాన్ తన బ్యాంక్ ఖాతా ఫ్రీజింగ్ ఆప్షన్‌ను విత్‌డ్రా చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు విచారణ జరిపి సైబర్ మోసంలో ఏడుగురు నిందితుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా గుజరాత్‌కు చెందిన నిందితులు ఇద్దరు షేక్ అఫ్తాబ్, దివాన్ మురాద్‌షాను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 23న అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారు. నిందితులు తెలంగాణ, మహారాష్ట్రలో ఇదే విధమైన పలు సైబర్ నేరాలకు పాల్పడినట్లు సైబర్ పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా సైబర్ నేరగాళ్ల అరెస్టులో కీలకంగా పనిచేసిన కరీంనగర్ సైబర్ క్రైం ఠాణా డిప్యూటీ ఏఎస్పీ వి నర్సింహారెడ్డిని టీజీసీ ఎస్‌బీ డైరెక్టర్ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన వినయ్(23) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ రాఘవపూర్ ఇటుక బట్టీల ప్రాంతంలో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతుండగా షాక్ తగలడంతో స్పృహ తప్పి పడిపోయాడు. పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఇంకా ఎలాంటి ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లి గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం రాత్రి మట్టిని తరలిస్తున్నా టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతులు ఉన్నా సమయ పాలన పాటించాలని, అక్రమ మట్టి దందాదారులపై చర్యలు తప్పవన్నారు. ఆర్‌ఐ భాను, సిబ్బంది ఉన్నారు.

టెలీఫోన్ క్వార్టర్స్ ప్రాంతంలో దొంగతనం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని టెలీఫోన్ క్వార్టర్స్ ప్రాంతం రోడ్ నంబర్-1లోని జె రఘునందన్‌రావు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులు అపహరించుకుపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. రఘునందన్‌రావు ఇటీవలనే ఇంటికి తాళం వేసి కుటుంబంతో అమెరికా వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన ముసుగువేసుకున్న నిందితుడు సీసీకెమెరాను పక్కకు జరిపి. ఇంటితాళలు పగులగొట్టి లోపల బీరువా తెరచి, పడక గదిలోని సామగ్రిని చిందరవందర చేసి విలువైన వస్తువులను ఎత్తుకుపోయాడు. 2 తులాల బంగారం, 10 వేల నగదు, యాపిల్ కంపెనీ వాచ్, టాబ్, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.



తాళం పగులగొట్టిన దుండగుడు

వేర్వేరు చోట్ల తహసీల్దార్ ఎదుట బైండోవర్

మంథని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గతంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసిన పలువురిని మంథని తహసీల్దార్ రాజయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, వేముల మహేష్, భీమినేని రాజేష్, బుద్దార్తి సమ్మయ్య, కాసు రాజ్‌కుమార్‌లు ప్రభుత్వానికి చెందిన పీడీఎస్ రైస్ కొని అక్రమంగా గతంలో తరలించారని తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ముత్తారంలో నాటు సారా విక్రయదారులు..

ముత్తారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయదారులను తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. అడవి శ్రీరాంపూర్, ముత్తారం, రామకృష్ణాపూర్, మచ్చుపేట, కేశనపల్లి, హరిపురం తదితర గ్రామాల్లో ఎక్సైజ్ పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించి విక్రయదారులను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట శుక్రవారం బైండో వర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏడాది కాలానికి లక్ష రూపాయల పూచీ కత్తుతో బైండోవర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆబ్కారీ ఎస్‌ఐ సాయి కుమార్, సిబ్బంది రాజేందర్, మహేందర్, రఘు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

శంకరపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవ పట్నంలో బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనివాస్ ఈ నెల 24న రాత్రి 9:30గంటలకు తన ఇంటి వద్ద గొడవ జరుగుతుందని డయల్ 100కు కాల్ చేశాడు. డ్యూటీలో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ చేస్తూ వీడియో చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో గొల్లెన శ్రీనివాస్, అతడి అల్లుడు బొజ్జ పవన్ బ్లూకోల్ట్స్ సిబ్బందిని దూషిస్తూ అడ్డుకున్నారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి ఇబ్బందులకు గురిచేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లెన శ్రీనివాస్, బొజ్జ పవన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వేలేరు పోలీసుల అదుపులో యువకులు

హుజూరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను హనుమకొండ జిల్లా వేలేరు మండల పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్న సంఘటన చోటు చేసుకుంది. హుజూరాబాద్ పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన తేజ(కిట్టు)తో పాటు వెంకటేష్ అనే ఇద్దరు యువకులకు గంజాయి విక్రయదారులతో సంబంధాలు ఉన్నాయని వేలేరు పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గతంలో వెంకటేష్ గంజాయి విక్రయిస్తూ వరంగల్ జిల్లాలో పట్టుబడ్డాడు. వెంకటేష్ స్నేహితుడు తేజ కావడంతో అతనికి కూడా సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో సమగ్ర విచారణకు ఇద్దరు యువకులను మహారాష్ట్ర నంబరు కలిగిన వాహనంలో తీసుకెళ్లడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్‌ను వివరణ కోరగా ఆ ఇద్దరు యువకుల తరలింపుపై ఆరా తీయగా హనుమకొండ జిల్లా వేలేరు పోలీసులు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై నవీన్, తహీల్దార్ వినోద్ తెలిపారు. ఆర్మూర్ నుంచి వచ్చిన లారీలు ఇసుకను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది దాడులు చేశారు. గురువారం అర్ధరాత్రి ఇసుకను తోడుతున్నట్టు సమాచారం మేరకు రెండు లారీలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎలక్ట్రిక్ క్రేజ్

మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రేజ్ పెరిగిపోతోంది. పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు ఈజీ డ్రైవ్‌కు ఎలక్ట్రిక్ వాహనాలు అనుకూలంగా ఉండటంతో మహిళలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. సిటీ పరిధిలో ప్రయాణం చేసేవారు ఈ-బైక్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ప్రయాణ ఖర్చుతో పాటు మెయింటనెన్స్ ఖర్చు తక్కువగా ఉండటంతో వాహనాల కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ-బైక్స్ మూడు యూనిట్ల కరెంట్‌తో 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉంది.



జగిత్యాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఈ బైక్స్

- పెరుగుతున్న ఈ-బైక్స్
- ఆసక్తి చూపుతున్న అన్ని వర్గాల ప్రజలు

జగిత్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. రోజు రోజుకు ఈ-బైక్స్ కొనుగోళ్లు పెరుగుతున్నాయి. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకునే చాలా మంది వీటిపై మక్కువ చూపుతున్నారు. జిల్లా కేంద్రమైన జగిత్యాలలోనే కాకుండా ప్రధాన పట్టణాలయిన కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురితో పాటు పలు మండల కేంద్రాల్లో ఎలక్ట్రిక్ బైక్ షోరూంలు వెలిశాయి.

పెరుగుతున్న విక్రయాలు

జగిత్యాల జిల్లాలో సంవత్సరానికి సుమారు పది వేలకు పైగా బైకులు అమ్ముడు పోతున్నాయన్న అంచనా ఉంది. జిల్లాలో ప్రస్తుతం పెట్రోల్‌తో నడిచే బైకులు సుమారు 80 వేల వరకు ఉన్నట్లు అధికారుల రికార్డులు చెబుతుండగా, నిత్యం 40నుంచి 50వరకు వరకు వెహికల్స్ రిజిస్ట్రేషన్ కోసం క్యూ కడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో అయిదు వేలకు పైగా ఈబైక్స్ ఉండగా ఈ మధ్యకాలంలో నెలకు సుమారు 800 నుంచి 1000 వరకు ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరుగుతున్నాయన్న అంచనా ఉంది. గతంతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల సేల్స్ పెరిగాయి.



ఈ-బైక్స్ వినియోగిస్తున్న వాహన చోదకులు

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ

కాలుష్యాన్ని నియంత్రించి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఇది వరకు కేంద్ర ప్రభుత్వం ఫేమ్ ఇండియా స్కీం వన్, టూ ఫేజ్ కింద కిలో వాట్‌కు రూ. 10 వేల చొప్పున సబ్సిడీలు కూడా అందించింది. దీంతో చాలా మంది ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు మొగ్గు చూపగా, ఇటీవల కాలంలో ఆ ప్రభావం ఇంకాస్త ఎక్కువైంది. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సదుపాయం కల్పించడం, ఈ బైక్ 3 యూనిట్ల కరెంట్‌తోనే 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉండటంతో చాలామంది ఈ వాహనాలనే కొనేందుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని కంపెనీలు స్కూటీతో స్పోర్ట్స్ బైక్ మోడల్స్‌ను కూడా ఇంట్రడ్యూస్ చేయడంతో మరింత క్రేజ్ వచ్చింది.

ఈ- రిక్షాల వైపు సైతం..

ఎలక్ట్రిక్ బైకుల ఇప్పటికే జనాల్లోకి వెళ్లిపోగా ఆటోలు, కూడా ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా ఆటో రిక్షాలు ఉండగా, ఈ - రిక్షాలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ఆటోలో8 యూనిట్ల కరెంట్‌తోనే 150 కిలోమీటర్లు పైగా ప్రయాణించే అవకాశం ఉండడంతో చాలామంది డీజిల్ బండ్లను వదిలి ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే ఎలక్ట్రిక్ ఆటోల అమ్మకాలు పెరుగుతుండగా, అన్ని కంపెనీలు కలిసి నెలకు సుమారు పదికి పైగా సేల్ చేస్తున్నట్లు డీలర్స్ చెబుతున్నారు. ముున్ముందు ఎలక్ట్రిక్ ఆటోల సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ-బైక్‌ల వినియోగం పెరుగుతున్నాయి...



గతంతో పోలిస్తే ఇటీవలి కాలంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం సంఖ్య పెరిగింది. జగిత్యాల పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో నిత్యం వంద వరకు బైక్‌లు అమ్ముడు పోతున్నాయి. రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఎలక్ట్రికల్ స్కీం కింద రూ. 10 వేల రకు సబ్సిడీ అందిస్తోంది.

- గంటెడి వినయ్ కుమార్

పెట్రోలు బాధలు తప్పాయి



ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసి సుమారు నాలుగు నెలలు అవుతోంది. పెట్రోలు బాధలు తప్పాయి. ఇటీవల కాలంలో అనేక మంది ఈ-వెహికల్స్ పట్ల మొగ్గు చూపుతున్నారు. ప్రయాణం సైతం సౌకర్యవంతంగా ఉంటోంది. లగేజీ తీసుకవెళ్లడానికి సైతం వీలుగా ఉంది. రాత్రి సమయంలో చార్జింగ్ పెడుతున్నాను. దినమంతా వినియోగించుకోవడానికి వీలుఅవుతోంది.

- బట్టు ప్రవీణ్, వాహన చోదకుడు, జగిత్యాల

న్యూస్ బాక్స్

నవంబరు 5 నుంచి బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలి పారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం www.sata vahana. ac.in వెబ్‌సైట్ సందర్శించాలని పరీక్షల నియంత్రణాధికారి సూచించారు.

ఫార్మసీ కళాశాలను సందర్శించిన వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్‌ఎండీ క్యాంపస్ లోగల ఫార్మసీ కళాశాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీశైలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్ వీసీకి స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్‌లో గల వివిధ భవనాలను వీసీ పరిశీలించారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు, వసతి గృహాలకు నూతన భవనాలు, క్యాంపస్ స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

29న హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని కోరారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాలకు 9441925807 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దురు మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు., పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ రహదారిలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరి దుర్మరణం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దురు మృతి చెందారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి శ్రీనివాస్(45) మేనల్లుడైన నివాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాయికల్‌లో ఓ శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి తిరుగుముఖం పట్టారు. అదే సమయంలో మెట్‌పల్లికి చెందిన దగ్గుల స్వామి(55) వెల్లుల్లలో ఉన్న తల్లిని కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో వీరి వాహనాలు ఢీకొనడంతో పోతుగంటి శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దగ్గుల స్వామికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు దగ్గుల స్వామిని నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. పోతుగంటి శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. దగ్గుల స్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైపాస్ రోడ్డుపై ..

జగిత్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహదారిలో ఎదురె దురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మనోజ్ కుమార్ (63) అనే వృద్ధుడు తన ద్విచక్ర వాహ నంపై జగిత్యాల నుంచి గొల్లపల్లి వైపు వెళుతున్నాడు. గొల్లపల్లి నుంచి ప్రవీణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై జగిత్యాలకు వస్తున్న క్రమంలో గొల్లపల్లి బైపాస్ సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. తీవ్ర గాయాలైన మనోజ్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

జ్యోతినగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ రహదారిలోని ఆర్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరిపురం వంశీ(28) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎన్టీపీసీ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న క్రమంలో ఆర్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడిని వంశీకి తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బైక్ నడిపిన సాయిసతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్‌ఐ కె.సతీష్ తెలిపారు.



వెల్లుల్ల శివారులో ఢీకొన్న బైక్‌లు





మృతి చెందిన శ్రీనివాస్, స్వామి(ఫైల్)

స్వీట్ మెమొరీ..

- జ్ఞాపికల తయారీతో స్వయం ఉపాధి

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సందర్భం ఏదైనా.. మనం ఆత్మీయులకు అందించే జ్ఞాపికలు కలకాలం నిలిచిపోతాయి. అలాంటి జ్ఞాపికల తయారీలో తనదైన ముద్రను వేస్తున్నారు కరీంనగర్‌కు చెందిన దూడం తిరుపతి. ఏడో తరగతి వరకు చదువుకున్నా జ్ఞాపికల తయారీలో పట్టు సాధించాడు. 2011లో లతా గ్రాఫిక్స్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని మెమొంటోలు తయారు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్తకొత్త డిజైన్లలో మెమొంటోలు తయారు చేస్తున్నాడు. ఇందుకోసం కంప్యూటర్‌పై అవగాహన పెంచుకున్నాడు. తనకవసరమైన డిజైన్లను కంప్యూటర్‌పై రూపొందించి మెమొంటోలు తయారు చేస్తాడు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు సంస్థలకు ఆయన అందమైన మెమొంటోస్ తయారు చేసి ఇచ్చాడు. వుడ్ కటింగ్ మెమొంటోలు, క్రిస్టల్, డిజిటల్ మెమొంటోలు, యోగ్యతాపత్రాలు, సన్మాన పత్రాలు ఆయన తయారు చేస్తున్నాడు. మెమెంటోలు ఆయా డిజైన్లను బట్టి 50 నుంచి ఐదు వేల రూపాయల వరకు ధర ఉంటుంది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు తిరుపతి తయారుచేసిన జ్ఞాపికలనే అందించాడు.



మెమోంటోలను తయారు చేస్తున్న దూడం తిరుపతి



కంప్యూటర్‌లో మెమోంటోలను డిజైన్ చేస్తున్న తిరుపతి

- ప్రభుత్వం ప్రోత్సహిస్తే యువతకు శిక్షణ ఇస్తా..



ఎంతో మంది నిరుద్యోగ యువత ఉపాధిలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మాలాంటి వాళ్లకు ప్రోత్సాహం అందిస్తే యువతకు జ్ఞాపికల తయారీ రంగంలో ప్రత్యేక శిక్షణను అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

- దూడం తిరుపతి

వానరాల మృత్యువాత

వేములవాడ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామ శివారులో శుక్రవారం వానరాలు మృత్యువాత పడ్డాయి. వేములవాడ విలీన గ్రామమైన ఆరో వార్డు శాంతినగర్ సమీపంలోని ఓ చెట్ల పొదల్లో 50 కోతులను మృతి చెంది కనిపించాయి. గుర్తు తెలియన దుర్మార్గులు విషప్రయోగం చేసి కోతులను చంపినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోతుల కళేబరాలను మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులను వివరణ కోరగా ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.



కోతుల కళేబరాలను తరలిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన కేటీఆర్

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన సామంతుల రమేష్, నర్సింహుల పల్లె గ్రామానికి చెందిన వేల్పుల సంజీవ్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. వెనక నుంచి వచ్చి కారు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్లలో పలు కార్యక్రమంలో పాల్గొని హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రమాదాన్ని చూసి వివరాలు అడిగి తెసుకున్నారు. 108 వాహనాలకు ఫోన్ చేయడం తోపాటు క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. గాయపడ్డ వారిని 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.



వివరాలు తెలుసుకుంటున్న కేటీఆర్

అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి 'మోనిహార' ఎంపిక


వారాల అన్వేష్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా రంగంలో ఉన్న వారాల అన్వేష్ అనే యువకుడు డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా రూపొందించిన 'మోనిహార' 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి ఎంపికైంది. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవంబరు 20 నుచి 28 వరకు గోవాలో నిర్వహించే 55వ ఇఫీ (ఐఎఫ్ఎఫ్ఐ) చలనచిత్రోత్సవంలో వివిధ భారతీయ భాషల్లోంచి వచ్చిన నాన్ ఫీచర్ సినిమాల ఎంపికలో 'మోనిహార' ఒకటి. ఈ చిత్రం బెంగాలి భాషలో నిర్మించారు. కోల్‌కత్తాలోని సత్యజిత్‌రే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో అన్వేష్ సినిమాటోగ్రఫిలో పీజీ కోర్సు పూర్తి చేశారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ రాసిన 'మోనిహార' కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రానికి సుభాదీప్ బిస్వామి దర్శకత్వం వహించారు. అన్వేష్‌కు పలువురు సినిమా, లఘుచిత్ర రంగ బాధ్యులు నటులు తదితరులు అభినందించారు.

కబడ్డీ పోటీల్లో ఎస్సారార్‌కు ద్వితీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర కళాశాలల కబడ్డీ పోటీల్లో ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు క ళాశాల విద్యార్థులు సంజయ్, మనీంద్ర, ఎండీ అజహర్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, పీడీ నాగేశ్వర్‌రావు, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, అధ్యాపకుడు సత్యప్రకాశ్, తదితరులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


రైల్వే స్టేషన్‌లో నిరసన తెలియజేస్తున్న వైఎఫ్ఐ జిల్లా నాయకులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో ఖాళీ పోస్టులను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారులోని రైల్వే స్టేషన్‌లో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో సిబ్బంది కొరత ఉందని, సుమారు 25వేల ఉద్యోగాలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత కుటుంబ పోషణ భారమై ఆత్మ బలిదానాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి చదువులు చదివి తీర సమయానికి ఉద్యోగాలు రాక నిరాశకు గురైన యువతకు రైల్వే శాఖ ఉద్యోగాలలో నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జావిద్ హుస్సేన్, కృపాల్ సింగ్, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో స్క్రాప్ చోరీపై విజిలెన్స్ విచారణ

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని స్క్రాప్ చోరీపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది. శుక్రవారం కరీంనగర్‌లో విజిలెన్స్ అధికారులు రామగుండం నగరపాలక సంస్థలో పని చేసిన పలువురు అధికారులను విచారించారు. స్క్రాప్ చోరీ ఘటనపై ఎఫ్ఐఆర్‌తో పాటు ఇప్పటికే నమోదు చేసిన పలువురు స్టేట్‌మెంట్ల ఆధారంగా అధికారులను విచారించారు. ఏయే అధికారులు స్క్రాప్‌కు కస్టోడియన్‌గా ఉన్నారు, ఏ రోజు చోరీ జరిగింది. ఎంత మొత్తంలో చోరీ జరిగిందనే కోణంలో విచారణ జరిపారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులతో పాటు ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్య విభాగాలకు చెందిన ఆరుగురు అధికారులను విచారించినట్టు సమాచారం. స్క్రాప్ చోరీ రామగుండంలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కొందరు ప్రజా ప్రతినిధుల ప్రమేయం ప్రస్ఫుటమయ్యింది. ఇటీవల పోలీస్ ఉన్నతాధికారులు కూడా ఈ కేసు పెండింగ్ గురించి ఆరా తీశారు. ఇదే సమయంలో విజిలెన్స్ విచారణ, వివిధ విభాగాలకు చెందిన అధికారులను పిలిపించడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కాగా, రామగుండం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన చోరీ ఘటనలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు బలిపశువులయ్యారనే ప్రచారం జరుగుతోంది. అప్పటి కమిషనర్ శంకర్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులను కస్టోడియన్లుగా పేర్కొన్నట్టు సమాచారం. పోలీస్‌శాఖ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులకు విజిలెన్స్ నోటీసులు ఇచ్చింది. కాగా ఈ ఘటనలో పూర్తి విచారణ జరపాలని పలువురు అధికారులు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

వారెవ్వా.. వావిలాల ఖాదీ

ఖాదీ.. ఈ పేరు వింటేనే అందరికీ మహాత్ముడి విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం గుర్తుకువస్తోంది. ఆ ఉద్యమంలో భాగంగా 1924లో వావిలాలలో ఖాదీ వస్త్రోత్పత్తి ప్రారంభమైంది. 1983 ప్రతిష్ఠాన్‌గా రూపొంది ఎన్నో అవార్డులు సాధించింది. ఇక్కడ తయారైన మువ్వన్నెల జెండా ఢిల్లీ ఎర్రకోటపై రెపరెపలాడింది. ఇండియన్ రైల్వేస్ తన సిబ్బంది యూనిఫామ్స్‌కు ఇక్కడ రూపొందించిన వస్త్రాలనే ఉపయోగిస్తోంది. రెడీమేడ్ దుస్తుల జోరులోనూ వావిలాల ఖాదీ వస్త్రాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.


ఖాదీ వస్త్రాలు


రంగులు అద్ది ఆరబెట్టిన ధారం

- ఏటా కోట్లాది రూపాయల ఉత్పత్తులు
- వెయ్యి మంది కార్మికులకు ఉపాధి
- రెడిమేడ్ దుస్తులకు ధీటుగా వెరైటీ డిజైన్ల తయారీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మొదలైన వావిలాల ఖాదీ పరిశ్రమ స్వాతంత్రానంతరం వచ్చిన అనేక మార్పులకు తట్టుకుని నిలబడింది. మార్కెట్‌లో వచ్చిన పారిశ్రామిక ఉత్పత్తుల పోటీని తట్టుకుని వాటికి దీటుగా అందమైన డిజైన్లను రూపకల్పన చేస్తోంది. స్థానికంగా వేయికి పైగా కుటుంబాలకు ఉపాధినిస్తున్న వావిలాల ఖాదీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఖాదీ వస్త్ర ప్రియుల మన్ననలను వందేళ్లుగా పొందుతోంది.మంది ఖాదీ పి మహాత్మా గాంధీ స్ఫూర్తితో వావిలాల ఖాదీ ప్రతిష్టాన్‌ను ప్రారంభించారు. ఈ సంస్థ తన ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్లను అధిగమించింది. ఎర్రకోటపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకం ఇక్కడి నేత కార్మికుల చేతుల మీదుగా రూపు దిద్దుకుంది. వంద సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఖాదీ సంస్థ 1983లో ప్రతిష్టాన్‌గా రూపుదిద్దుకుంది. ఏటా కోట్లాది రూపాయాల ఉత్పత్తులను తయారు చేస్తూ వెయ్యి మందికి పైగా కార్మికులకు ఉపాధి అందిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వెరైటీ డిజైన్ల తయారీతో రెడీమేడ్ దుస్తులకు గట్టి పోటీ ఇస్తోంది. ఇటీవలి కాలంలో యువత ఖాదీ వస్త్రాలపై మొగ్గు చూపుతుండడంతో నయా ట్రెండ్ మొదలైంది.

● 1924లో ప్రారంభం

గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో 1924లో అఖిల భారత చరకా సంఘ్‌లో భాగంగా ఖాదీ వస్త్రోత్పత్తి ప్రారంభమైంది. అన్నాసాహెబ్ సహస్ర బుద్ధే, లేలేజీ వంటి వారు ఇక్కడ ఖాదీ సంస్థను ప్రారంభించారు. 1983లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్‌గా ఆవిర్భవించింది. 13 ఎకరాల విస్తీర్ణంలో ఖాదీ వస్త్రాలయం ఉంది.

● కార్మికులకు నీడను ఇస్తున్న సంస్థ

ఖాదీ ప్రతిష్టాన్‌లో దూది నుంచి ఏకులు వడకడం మొదలు కార్పెట్లు నేసే వరకూ ప్రతి పనిని కార్మికులు వారు తయారు చేసుకున్న యంత్రాలతోనే చేస్తారు. తెలంగాణలోనే ఏకైక సింప్లెక్స్ (కార్డింగ్) మిషన్ వావిలాల ఖాదీ ప్రతిష్టాన్‌లో ఉంది. కోయంబత్తూర్ నుంచి ఈ మిషన్‌ను ప్రత్యేకంగా తెప్పించారు. ఇక్కడ నేసే కార్పెట్లకు మంచి గిరాకీ ఉంది. రోజుల తరబడి నలుగురు అంతకంటే ఎక్కువ మంది కార్మికులు కష్టపడితే తప్ప ఒక్క కార్పెట్ తయారవదు. మామూలు రాట్నానికి కొంత సాంకేతికతను జోడించి తయారు చేసిన సైకిల్ రాట్నాన్ని తయారు చేశారు. ఈ రాట్నం ద్వారా ఒకేసారి 16 కుదుళ్లను పెట్టి రోజుకు మహిళా కూలీ 40 చిట్టాల వరకు తయారు చేస్తుంది.

● విస్తరించిన ఉత్పత్తులు

వావిలాలలో ప్రారంభమైన ఖాదీ వస్త్రాల ఉత్పత్తి తర్వాతికాలంలో హుజూరాబాద్ మండలం రాంపూర్, వరంగల్ జిల్లా మొగుళ్లపల్లి, తొర్రూర్ మండల కేంద్రాల్లో మొదలయ్యింది. ఆయా కేంద్రాల్లో తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను వావిలాలకు తరలించి అక్కడి నుంచి మార్కెటింగ్ కేంద్రాలకు పంపుతున్నారు. ఇండియన్ రైల్వేస్ తమ యూనిఫామ్స్‌కు వావిలాల ఖాదీ వస్త్రాలనే ఉపయోగిస్తోంది. ముంబై, ఢిల్లీ, కేరళ, చెన్నై ఖాదీ కమిషన్లు ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. కోల్‌కతా, నాగ్‌పూర్, కోయంబత్తూరు, బెంగళూరు, అహ్మదాబాద్, మధురై నగరాలకు ఇక్కడి ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు మార్కెటింగ్ కేంద్రాల ద్వారా ఖాదీ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. యేటా నాలుగు ఉత్పత్తి కేంద్రాల ద్వారా నాలుగు కోట్ల పైచిలుకు విలువైన వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. విక్రయ కేంద్రాల ద్వారా ఖాదీ వస్త్రాలతో పాటు తేనె, శాండల్ పౌడర్, సబ్బులు, అగర్‌బత్తీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ విక్రయిస్తున్నారు. సూటింగ్స్, షర్టింగ్స్, చద్దర్లు, కార్పెట్లు, టవల్స్, లుంగీలు, చీరలు, ఖర్చీఫ్స్, తదితర ఖాదీ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

● వస్త్రాల తయారీ ఇలా...



కర్ణాటకలోని చిత్రదుర్గ ఖాదీ కమిషన్ నుంచి వావిలాల ఖాదీ ప్రతిష్టాన్ శుద్ధి చేసిన దూదిని కొనుగోలు చేస్తుంది. సింప్లెక్స్, డ్రాయింగ్ మిషన్లతో ఏకులు వడికి, వాటిని 8, 16 కుదుళ్ల రాట్నాలపై కార్మికులతో వడికిస్తారు. ఇలా తయారైన దారానికి అవ సరం మేరకు రంగులు అద్దుతారు. ఈ దా రాన్ని వార్పింగ్ యంత్రాలపై భీములు తయారు చేసి నేత కోసం కార్మికులకు అందజేస్తారు. కార్మికులు నేసిన వస్త్రాన్ని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో రెండు రోజు ల పాటు ఉంచి స్టార్చ్, నీలి, కినోపాల్ మిశ్రమంతో కలిపి ఆరేస్తారు. దానిని ఇస్త్రీ చేసి మీటర్ చొప్పున ఫోల్డింగ్ చేస్తారు. చివరగా కార్మికులు వస్త్రాలపై పోగులు తొలగించి అమ్మకం కోసం పంపుతారు.

● ఆటుపోట్లు ఎదురైనా..

ఐఎస్‌ఓ 9000 సర్టిఫైడ్ కంపెనీ అయిన వావిలాల ఖాదీ ప్రతిష్టాన్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే మార్కెట్‌లో నిలబడుతోంది. ఖాదీ వస్త్రాల ఉత్పత్తిపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం ప్రోత్సాహకంగా ఇస్తుండగా, అంతే మొత్తాన్ని ఖాదీ ప్రతిష్టాన్ తమ అమ్మకాలపై వినియోగదారులకు రాయితీగా అందజేస్తోంది. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 20శాతం రిబేట్, ఇన్స్‌రెన్స్, పెన్షన్, సంస్థకు డిస్కౌంట్లు ఇస్తే ఖాదీ మరింత వృద్ధి చెందే అవకాశం ఉంది

● ఎర్రకోటపై రెపరెప లాడిన వావిలాల జెండా

వావిలాల ఖాదీ ఢిల్లీ ఎర్రకోటపై రెపరెపలాడింది. 1989 ఆగస్టు 15న అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీ ఎర్రకోటపై వావిలాల ఖాదీ నుంచి పంపిన మువ్వన్నెల జెండాను ఎగురువేశారు.

● ఖాదీ వస్త్రాలపై యువత ఆసక్తి

రెడిమెడ్ వస్త్రాలకు దీటుగా ఖాదీ సంస్థ వెరైటీ డిజైన్లతో వస్త్రాల ఉత్పత్తి చేస్తుండడంతో యువత ఆసక్తి కనబరుస్తుంది. వావిలాల ఖాదీలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు.


ధారం తయారీ యంత్రం


వెరైటీ డిజైన్ల వస్త్రాలు

న్యూస్ బాక్స్

రేపు సికింద్రాబాద్ సదర్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఆదివారం సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సికింద్రాబాద్ సదర్ మహోత్సవాల కరపత్రాన్ని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు రాజారాం యాదవ్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. శుక్రవారం కోర్టు సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మంచాల రవీందర్‌యాదవ్, కాల్వ మల్లేశం యాదవ్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు పరుశరామ్ యాదవ్, కరీంనగర్ అధ్యక్షుడు సాయవేణి రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ సదర్ మహోత్స వాలకు జిల్లాలోని యాదవ ప్రజాప్రతినిధులు, నాయకులు, యాదవ సంఘం జిల్లా, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు, యాదవ సంఘ ప్రముఖులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

రెండిళ్లలో చోరీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రెండిళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. రాంనగర్ రోడ్డు నెంబర్ 8లో నివాసం ఉంటున్న కూర కిషన్ స్టాంప్ వెండర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటికి తాళం వేసి గురువారం రాత్రి నగరంలోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో నిల్వ ఉ న్న రూ. 20వేల విలువగల స్టాంప్ పేప ర్స్ రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● వన్‌టౌన్ పరిధిలోని వినాయకనగర్ రోడ్డు నంబర్ 4లో నివాసం ఉంటున్న కాట రమేష్ వ్యాపారం చేస్తున్నాడు. అతని సోదరుడు మృతి చెందటంతో మానకొండూర్ మండలం కెల్లెడకు వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఇంట్లో బీరువా పగలగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. అందులో ఉన్న వస్తువులు కిందపడేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా సీఐ కోటేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో బీరువాలో ఉంచిన 4.5 తలాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు బీడీ కార్మికుల మహాసభ

మల్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో శనివారం బీడీ కార్మికు జగిత్యాల జిల్లా రెండో మహాసభ నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొక్కుల శాంత, సుతారి రాములు కోరారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ గట్టిందుకు ఈ మహాసభ నిర్వహి స్తున్నామని చెప్పారు. బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథం, ముత్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ఆదాయంపై రైతుల ఆశలు

● గెలలు వేసిన ఆయిల్ పామ్ చెట్లు.. ● మూడేళ్ల శ్రమకు దక్కనున్న ప్రతిఫలం ● మరో 4 నెలల్లో అమ్మకాలు షురూ..

జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతులు ఆదాయంపై ఆశలు పెంచుకుంటున్నారు. మూడేళ్ల క్రితం తాము నాటిన ఆయిల్ పామ్ చెట్లు కాపుకొచ్చాయి.. చెట్లకున్న గెలలను చూసి రైతులు ఆదాయాన్ని అంచానా వేస్తున్నారు. మరో మూడు నెలల్లో మార్కెట్‌లో పంటను విక్రయించే అవకాశాలున్నాయి.


ఆయిల్‌పామ్స్ తోటలు


ఆయిల్‌పామ్ కాయలు


గెలలు వేసిన ఆయిల్‌పామ్ చెట్టు

మంథని/ముత్తారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలు మొదటి సారి కాపునకు వచ్చాయి. ప్రస్తుతం చాలా చోట్ల చెట్లకు కాయల గెలలు వేశాయి. దీంతో తొలి దశలో ఎకరాకు 3-5 టన్నులు దిగుబడి వస్తుందని అధి కారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల ప్రోత్సాహంతో జిల్లాలో మూడేళ్ల క్రితం మలేషియా, సింగపూర్ నుంచి బ్రీడ్ తెచ్చి నాటిన ఆయిల్ పామ్ తోటల్లో కాపు (గెలలు వేయడం) ప్రారంభమైంది. జిల్లాలోని ఉద్యానవశాఖ అధికారులు ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి తేనెటీగలు (వీవిల్స్) తెప్పించి ఆయిల్‌పామ్ మొగ్గలను ఫలదీకరణం చెందించడంతో గెలల సంఖ్య బాగా పెరిగింది. ఒక్కో మొక్కకు ఆరు నుంచి 10 గెలలు వేయగా, మరో నాలుగు నెలల్లో తొలి పంట కోతకు రానుంది.

● జిల్లాలో 2.393 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 14 మండలాల్లో 938 మందికి పైగా రైతులు సుమారు 2,393వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగుచేశారు. మంథని డివిజన్లో మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాల్లో 324 మంది రైతులు 855 ఎకరాల్లో సాగు చేశారు. ఆయిల్‌పామ్ చెట్లు నాటిన ఏడాదినుంచి గెలలు వేయగా, అధికా రుల సూచనల మేరకు రైతులు మొదటి రెండు సంవత్సరాలు వాటిని తీసేసి, మూడో సంవత్సరం ప్రారంభం నుంచి మంచి దిగుబడి కోసం ఎదురుచూస్తున్నారు. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం టన్నుకు మార్కెట్లో రూ.18 వేలు ధర పలుకుతోంది.

దీర్ఘకాలిక ప్రయోజనం పొందవచ్చు..



ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది. నీటి సౌకర్యం కలిగిన భూముల్లో ఈ పంట సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన మూడేళ్ల అనంతరం పంట దిగుబడి ప్రారంభమవుతుంది. సుమారు మూడు దశాబ్దాల పాటు గెలలు వేయడంతో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చు. నేను మూడు ఎకరాల్లో సాగు చేశాను. మరో నాలుగు నెలల్లో తొలిసారిగా ఆదాయం రానున్నది.

\- కల్యాణపు రాయమల్లు, ముత్తారం

హుండీ లెక్కింపులో ఉద్యోగి చేతివాటం

- రూ. 2 లక్షల విలువైన నగదు కాజేసేందుకు యత్నం
- అనుమానంతో విచారించిన భద్రతా సిబ్బంది
- ఉద్యోగిని సస్పెండ్ చేసిన ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి చేతివాటాన్ని ప్రదర్శించాడు. వేములవాడ రాజన్నపై ఎంతో నమ్మకంతో భక్తులు హుండీలో వేసిన కానుకలు పక్కదారి పట్టడం పట్టణంలో శుక్రవారం కలకలం రేపింది. రాజన్న ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. ఈ క్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగదు కాజేసేందుకు యత్నించినట్లు భద్రత సిబ్బంది గుర్తించారు. హుండీ కౌంటింగ్ పూర్తయిన పిదప కౌంటింగ్ హాల్‌లో ఉద్యోగి కనిపించడంతో అనుమానం వచ్చిన భద్రత సిబ్బంది తనిఖీ చేశారు. సుమారుగా రూ.2 లక్షల నగదును కాజేసే వ్యవ హారం బయటపడింది. విషయం బయటకు పొక్కకుండా అధికారలు జాగ్రత్త పడడం చర్చనీయాంశమైంది.

- ఆలయ ఉద్యోగుల హస్తం ఉందని అనుమానాలు..

రాజన్న ఆలయ హుండీల లెక్కింపులో పలు మార్లు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించిన విషయం తెలిసిందే. అయితే రాజన్న ఆలయం లోని ఉద్యోగులు ఒక టీమ్‌గా ఏర్పాటు కావడంతోనే ఇలాంటి సంఘ టనలు జరుగుతాయని, కౌంటింగ్ హాల్ పక్కన కోడెల క్యూలైన్‌ను ఆనుకుని ఉన్న ఇనుపజాలీ సైతం సగం వరకు తొలగించి కనిపించడంతో నగదు, బంగారం, వెండి పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వె ల్లువెత్తుతున్నాయి. హుండీ కౌంటింగ్‌లో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల భజన మండలి సభ్యులు పాల్గొంటారు. హుండీ లెక్కిం పులో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తూనే ఉంటారు. ఉద్యోగుల చేతివాటం ప్రదర్శించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన ఈ వ్యవహారంలో సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేసి నిజానిజాలను తేల్చాలని భక్తులు, పట్టణవాసులు కోరుతున్నారు.

నగదు దొరికింది నిజమే..

రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగదు కాజేసే యత్నం చేసింది నిజమే. అనుమానంగా కనిపించడంతో భద్రత సిబ్బంది 20 నుంచి 30 ఐదు వందల నోట్లను గుర్తించి పట్టుకున్నారు. విచారణ చేసి సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించాం. హుండీ లెక్కింపులో మరింత భద్రతను పెంచుతాం.

\- ఈవో వినోద్‌రెడ్డి

భూ కబ్జా అవాస్తవం: మేయర్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జాచేసినట్లు తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రేకుర్తిలోని సర్వేనెంబర్ 65 పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన పట్టాభూమి అన్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితమే పట్టాదారు ప్లాట్లు చేసి అమ్మకాలు చేశారన్నారు. అందులో కొన్ని మిగిలిపోగా వాటిని కొనుగోలు చేసి చట్టపరంగా తన పేరు, భార్యపేరుపై కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని తెలిపారు. అసత్య ఆరోపణల చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సునీల్‌రావు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వరలక్ష్మినగర్, మెహర్‌నగర్, బ్యాంక్ కాలనీ, డీమార్ట్ ప్రాంతం, రెడ్డి ఫంక్షన్ హాల్ ప్రాంతం, సీతారాంపూర్ బ్యాంకు ప్రాంతం, వావిలాలపల్లి ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓటరు అవగాహన సదస్సు

భగత్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు విద్యాసంస్థల్లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తనను పట్టభద్రులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

1న బీసీ కమిషన్ సభ్యుల పర్యటన

గణేష్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నవంబరు ఒకటవ తేదీన బీసీ కమిషన్, సభ్యులు కరీంనగర్‌లో పర్యటిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 1న కలెక్టరేట్ నందు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు విచారణ నిర్వహించనున్నట్ల తెలిపారు. రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలు సమర్పించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి

- ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

మానకొండూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోషకాహరం తీసుకుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ అన్నారు. మండలంలోని లలితాపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహరం తీసుకొని వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. బాల్య వివాహల వల్ల తలెత్తే ఇబ్బందులు, అక్రమ రవాణా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు ఆహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో వి శ్రీధర్, ఐసీడీఎస్ అధికారి శ్రీమతి, ఎంపీడీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

శంకరపట్నం: మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగార్జున అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎరడపల్లి, గద్దపాక గ్రామాల్లో ఫ్రై డే గ్రామసభలు నిర్వహిం చారు. ఎరడపల్లిలో నిర్వహించిన ఫ్రైడే గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మండల స్పెషలాఫీసర్ నాగార్జున మాట్లాడుతూ సీజనల్‌గా దొరికే కూరగాయలని, పండ్లను తీసుకోవాలని మహిళలకు సూచించారు. పీహెచ్‌సీలో ప్రతి మంగళ వారం నిర్వహించే ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఎంపీవో ప్రభాకర్, సీహెచ్‌వో భాస్కర్, డాక్టర్ సురేష్, ఐసీడీఎస్ సూప ర్‌వైజర్లు స్రవంతి, కవిత, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదిత రులు పాల్గొన్నారు.


చిన్నారులకు ఆహారం తినిపిస్తున్న ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

చొప్పదండి: మండలంలోని రేవెల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. కిచెన్ గార్డెన్, ఆరోగ్య మహిళా ప్రోగ్రాంలను మహిళలు వినియోగించుకోవాలని అదికారులు సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ తిరుపతి రావ్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, సీడీపీవో కస్తూరి, ఏసీడీపీవో నర్సింగరాణి, కార్యదర్శి గంగజమున, అంగన్‌వాడీ టీచర్ పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్ సెక్టార్ చెర్లబూత్కూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఐసీడీఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ వారి సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సతీష్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆశ, ఏఎన్‌యం, గర్భిణీ, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌నగర్/గణేష్‌నగర్: శుక్రవారం సభతో మహిళలకు మేలు జరుగుతుందని కరీంనగర్ అర్బన్ సీడీపీవో సబిత అన్నారు. శుక్రవారం నగరంలోని సీతారాంపూర్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే కాశ్మీర్‌గడ్డలో సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, టీచర్లు సులోచన, శైలజ, డీసీపీవో శాంత, డాక్టర్ అఖిల, ప్రధానోపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు స్వాగతం పలికిన నాయకులు

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూసీ పునర్జీవ కార్యక్రమంలో భాగంగా దక్షిణ కొరియాలోని సియోల్ పర్యటనను ముగించుకొని శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఛైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్‌ఛైర్మన్ వెన్న రాజమల్లయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతి గోపి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ సూచించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో శుక్రవారం గణిత శాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త గాల్వా జన్మదిన సందర్భంగా బీజ గణితంలో గాల్వా చేసిన పరిశోధనలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాల్వా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని, పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. అనంతరం శాతవాహన విశ్వవిద్యాలయం గణితశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె ప్రసాద్ మాట్లాడారు. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త గాల్వ అద్భుతమైన రచనలు చేశారని విద్యార్థులు వారి పరిశోధనలపై దృష్టిని సారించి మరిన్ని పరిశోధనలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్, సాంఖ్యాకశాస్త్ర అధిపతి మధు రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మొత్తం సుడా పరిధిలోకి..

(5వ పేజీ తరువాయి)

కిలో మీటర్ల విస్తీర్ణంతో పరిధిని విస్తరించి 20 సంవత్సరాల కోసం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ఆమేరకు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లా మొత్తాన్ని సుడా పరిధిలోకి తీసుకురావడంతో జిల్లా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాం

- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



జిల్లా మొత్తాన్ని శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ పరిధిలోకి తీసుకురావడంతో వేగంగా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. దీనితో మరింత బాధ్యతతో పాటు పనిభారం కూడా పెరుగుతుంది. ప్రస్తుతం ఉన్న సుడా స్టాఫ్‌ను మరింత పెంచుకోవాల్సి ఉంది. అందరి సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తాం.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విలీన గ్రామాల డివిజన్లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ చాహత్‌బాజ్‌పాయిని కలిసి విలీన డివిజన్ల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా మంచినీటి పైపులైన్లకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా 149 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. నిధులతో విలీన గ్రామాల్లో, ప్రస్తుత డివిజన్‌లలో కొత్తగా వాటర్ ట్యాంకులు, పైపులైన్‌ల పనులు ప్రారంభించాలని శ్రీనివాస్ కమిషనర్‌ను కోరారు.

రేపు ప్రొఫెసర్ సాయిబాబ సంస్మరణ సభ

సుభాష్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబ సంస్మరణ సభను ఈనెల 27న నిర్వహించనున్నట్లు పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి తెలిపారు. శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు, రైతులు, రైతు కూలీలు, మహిళ, యువజన, శ్రామిక వర్గ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, విప్లవ చరయిత సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, తెలంగాణ ప్రజాఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గాండ్ల మల్లేశం, తడగొండ చందు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'గంగుల'కు నేతల పరామర్శ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను శుక్రవారం ఆయన నివాసంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి పరామర్శించారు. మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, టి జీవన్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, భాస్కర్‌రావు, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, కొత్తపల్లి మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి పొల్సాని సుగుణాకర్‌రావు తదితరులు గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఎస్‌యూ వీసీని కలిసిన మాజీ మేయర్

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన ఉపకులపతిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ యూ ఉమేష్‌కుమార్‌ను శుక్రవారం ఆయన చాంబర్‌లో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ శాతవాహన యునివర్సిటీలో మరిన్ని డిపార్ట్మెంటు వచ్చేవిధంగా ప్రయత్నం చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ సాదవేణి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, చైతన్య, మహేష్, అరుణ్, బండ అనిల్ తదితరులు ఉన్నారు.

కరీంనగర్ రూరల్ (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్‌ను కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ మాలతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి సుమత, ఆఫీస్ సూపరింటెండెంట్ టి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వం చేయూత


చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిచ్చేందుకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలోని ఊరచెరువులో చేప పిల్లలు వేసే కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభిం చారు. నియోజకవర్గంలోని 302 చెరువులలో చేప పిల్లలను 100 శాతం సబ్సిడీతో వేస్తుందని అన్నారు. ముదిరాజ్ కులస్తులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు మ్రి ఓదెలు, వైస్ ఛైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక అధికారి విజయ, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, నాయకులు బుర్ర రాజేందర్, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పప్పు సమ్మయ్య, ఉపాధ్యక్షుడు కొలిపాక కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి కొలిపాక ప్రవీణ్, డైరెక్టర్లు పప్పు ఓదెలు, రేగుల కుమారస్వామి, పప్పు రమేశ్, పూసాల మల్లేశ్, అనవేని రమేశ్ పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 25: సాహితీగౌతమి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు నంది శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం ఫిలింభవన్‌లో హుజూరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు స్కూల్ అసిస్టెంట్ సంపత్‌రాజ్ రచించిన 'సరాకృతు లు, నేలతల్లి పదాలు పుస్తకావిష్కరణలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసా ద్‌లాల్ మాట్లాడుతూ సంపత్‌రాజ్ కవిత్వంలో సంప్రదాయం, ఆధుని కత ఉన్నాయని అన్నారు. డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, అన్నవరం దేవేందర్, డాక్టర్ కె రామకృష్ణ, గాజుల రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, జాతీయ భావాలను పెంపొందించుకోవాలని ట్రినిటి విద్యాసంస్థల ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ట్రినిటి కళాశాలలో దాసరి ప్రశాంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీన్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు భాషపై పట్టు సాధించేలా చూడాలి

గన్నేరువరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భాషపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనరావు అన్నారు. మండలం లోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు యూనిఫాం, షూలు, సాక్స్‌లను ధరించి పాఠశాలకు రావాలని సూచించారు. బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడమే ధ్యేయం


విద్యార్థులు తయారీ చేసిన ప్రాజెక్ట్‌లు పరిశీలిస్తున్న ఛైర్మన్ తిరుపతిరెడ్డి

జమ్మికుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడమే ధ్యేయమని న్యూమిలీనియం పాఠశాల ఛైర్మన్ మునిపట్ల తిరుపతి రెడ్డి అన్నారు. పట్టణంలోని న్యూ మిలీనియం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంటి వద్దనే వివిధ రకాల ప్రాజెక్ట్‌లు తయారీ చేసి పాఠశాలలో ప్రదర్శించారు. వాటి పనితీరును విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యకమంలో ప్రిన్సిపాళ్ల వరుణ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు హజర, ప్రియాంక, శారద, లావణ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల రికార్డుల తనిఖీ

శంకరపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామంలో సీఆర్‌డీ బృందం శుక్రవారం పర్యటించి ఈజీఎస్ పనులకు సంబంధించిన సెవెన్ రికార్డులను తనిఖీ చేసింది. రాబోయే సంవత్సరానికి బడ్జెట్‌కు అనుగుణంగా గ్రామసభ నిర్వహించి ప్రజా ఆమోదయోగ్యమైన పనులు గుర్తించాలని సభ్యులు సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌డీ బృందం సభ్యులు శరత్‌బాబు, అభయ్‌కుమార్, శివకుమార్, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శి దివ్యాంజలి తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే హంగామా

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామం లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానిల్ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎనర్జీ సెక్టార్‌లో మె కానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల పాత్రే కీలకంగా ఉంటుందన్నారు. . కార్యక్ర మంలో మెకానికల్ విభాగం విభాగాధిపతి డాక్టర్ ఎంవీ సతీష్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం మరో ఇద్దరికి చూపు ప్రసాదిస్తుందని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. జమ్మికుంటకు చెందిన వైద్యుడు తిరుపతయ్య తల్లి శనిగరం లక్ష్మి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. అంబేద్కర్‌కాలనీకి చెందిన అయిత సమ్మయ్య గుండె పోటుతో మృత్యువాత పడ్డాడు. వీరి కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీపీఐ బ్యాంకు పంపించారు.

నల్లా నీరు ఇలా.. తాగేది ఎలా?

- రెండు నెలలుగా కలుషితం, పురుగులు, రంగుమారిన నల్లా నీరు

- పట్టించుకునే వారే లేరు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన నీటినందిస్తున్నామని చెబుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో సరఫరా చేస్తున్న నల్లా నీటిని పట్టించుకోవడం లేదు. కొన్నిచోట్ల కలుషితమైన రంగుమారిన, తోకపురుగులు, వాననతో కూడిన నీరు సరఫరా అవుతోంది. దీనితో ఆయా ప్రాంతాల ప్రజలు అసలు నల్లా నీటినే వాడటం మానేశారు. ప్రతీ సంవత్సరం నీటిని శుద్ధి చేసేందుకు, మంచినీటి సరఫరాకు లక్షలాది రూపాయలను ఖర్చుచేస్తున్నప్పటికీ నల్లా నీరు చాలా చోట్ల కలుషితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరానికి తాగునీటిని అందిస్తున్న లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ)కి, మంచినీటి శుద్ధి కేంద్రానికి, మంచినీటి రిజర్వాయర్‌కు చేరువలోని సప్తగిరికాలనీ, ఏవోస్ మున్సిపల్ పార్కుకు సమీపంలోని ఒక కాలనీలో దాదాపు రెండు నెలల నుంచి నల్లా నీరు పూర్తిగా కలుషితమైనవే సరఫరా చేస్తున్నారు. దీనితో కాలనీలోని ప్రజలు నల్లానీటి వినియోగాన్ని మానుకొని బోరుబావు నీటిని శుద్ధి చేసుకొని తాగుతున్నామని చెబుతున్నారు. నగరపాలక సంస్థ శుద్ధి చేసిన నీటిని ఎక్కడా కలుషితం కాకుండా నల్లాల ద్వారా విడుదల చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. నల్లా నీరు రంగు నీళ్లు, దుర్వాసన, తోక పురుగులతో వస్తున్నాయని, దీంతో వీటిని తాగితే రోగాలు తప్పవని వారు ఆందోళన చెందుతున్నారు. నల్లాల ద్వారా కలుషిత నీరు వస్తుందని లైన్‌మెన్‌కు, ఇతర ఉద్యోగులకు చెప్పినా ఫలితం లేదని, ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వాతావరణంలో వస్తున్న మార్పులతో జ్వరాలు, ఒళ్లునొప్పులు, వాంతులు, విరేచనాలు అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నల్లానీరు కలుషితం కాకుండా చూడాలని, స్వచ్ఛమైన శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని కోరుతున్నారు.


నల్లాలో పంపిణీ అయిన రంగుమారిన నీరు, పురుగులు

గౌడ సంఘం గ్రామ కార్యవర్గం

గన్నేరువరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా న్యాలపట్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి రవికుమార్, ప్రధానకార్యదర్శిగా న్యాలపట్ల రవి, కోశాధికారిగా తాళ్లపల్లి పెద్దరాజయ్య, కార్యదర్శిగా తాళ్లపల్లి తిరుపతి, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాలపట్ల రమేశ్‌ను సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ సన్మానించారు.

అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కాట్రపల్లి గ్రామ కమిటీని సభ అధ్యక్షుడు మాడుగుల ఓదెలు అధ్యక్షతన శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మైస కరుణాకర్, ఉపాధ్యక్షులుగా మాడుగుల సురేష్, అంబాల పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా సంఘాల రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారులుగా తొగురు సంపత్, రావుల శ్రీనివాస్, నబ్బని రమేశ్, మైస కుమారస్వామి, వేల్పుల అశోక్, కార్యవర్గ సభ్యులుగా మాడుగుల వెంకటస్వామి, సంఘాల రాజు, మైసూర్ శ్రీనివాస్, మైస మల్లయ్య, రాట్ల రవీందర్‌ను నియమించారు.

మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

గంగాధర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు మండలాధ్యక్షుడు తాళ్ల స్వామి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మాలల మహా పాదయాత్ర పోస్టర్లర్‌ను గంగాధర ప్రధాన రహదారి అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 25న భద్రాచలంలో ప్రారంభమై 38 రోజుల పాటు, 16 జిల్లాలు, 35 నియోజకవర్గాల మీదుగా వెయ్యి కిలోమీటర్ల పాద యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 1 ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ల పసుల నరేష్, తాళ్ల అంజయ్య, గంగయ్య, ప్రమోద్, సుమ న్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'అల్ఫోర్స్' విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ అకాడమిలో నిర్వహించిన ఎస్‌జీ ఎఫ్ జోనల్ స్థాయి అర్చరీ పోటీల్లో కె మనికేశ్వర్, జి హర్షిణి, అండర్ -17 విభాగంలో ప్రతిభ చాటి పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: హుజూరాబాద్‌లో నవంబరు 3న కోదండరాం నిర్వహించే మాటా ముచ్చట కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని తెలంగాణ జన సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ, సీనియర్ న్యాయ వాది ముక్కెర రాజు శుక్రవారం ఒక ప్రక టనలో కోరారు. తెలంగాణ సాధనలో కీలక భూమికను పోషించిన సకల జనుల సేనాని ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియామకమైన తర్వాత మొదటి సారిగా హుజూరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు.

● సైదాపూర్: కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో ఈ నెల 18న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి కరీంనగర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి సైదాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీహర్ష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. శ్రీహర్షను పలువురు అభినందించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పంజాల తిరుప తిగౌడ్‌ను బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అసెంబ్లీ అధ్యక్షుడిగా నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఉత్తర్వులు అందజేశారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో నల్ల పోచమ్మ, ఊర పోచమ్మ, హను మాన్ ఆలయాల పునః నిర్మాణం కోసం గోపాల్‌రావుపేట గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వాహకుడు ముతహర్‌పాషా రూ.11,111 విరాళం అందజేశాడు. ముస్లిం వ్యక్తి ఆలయం నిర్మాణానికి విరాళం ఇవ్వడంతో కమి టీ సభ్యులు అభినందించారు.

● చొప్పదండి: చొప్పదండిలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవ సాయ శాఖ ఏడీ ప్రియదర్శిని , ఏవో వంశి కృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● మానకొండూర్: మానకొండూర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద గుంతలను పూడ్చి వేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నందగిరి రమేశ్, ఎలుకపల్లి సుధాకర్, దండాల లక్ష్మణ్, గసిగంటి సంపత్, మోదుంపల్లి శేఖర్, రొడ్డ అంజయ్య తదితరులు ఉన్నారు.

● జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన రాజేందర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.